E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON    సంపుటి :01    సంచిక :108    శుక్రవారం    18 సెప్టెంబర్ 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 04    వెల :05/-

# గిరిజన రిజర్వేషన్ల పెంపునకు నాలుగేళ్లు

- గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వమే దోహదం చేసిందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను మరిచిందని విమర్శ
భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో సండ్రకు స్వాగతం
- పాల్గొన్న వందలాది మంది గిరిజనులు

సత్తుపల్లి/పెనుబల్లి, సెప్టెంబర్ 17 (తెలుగుగళం న్యూస్)



గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పెనుబల్లి మండలం సూరయ్య బంజర తండాలో గురువారం బంజారా గిరిజనులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం, పూలాభిషేకం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు గిరిజనులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు.అనంతరం వందలాది మంది గిరిజనులతో నిర్వహించిన సభలో సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ..తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, పోడు భూములకు పట్టాలు అందించి గిరిజన రైతులను ఆదుకోవడం, పోడు భూములకు రైతుబంధు పథకాన్ని వర్తింపజేయడం వంటి



కార్యక్రమాలను చేపట్టి గిరిజనుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.కేసీఆర్ హయాంలో గిరిజనులకు పింఛన్లు, గిరి వికాస్ పథకం ద్వారా బోర్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు.గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వమే దోహదం చేసిందని పేర్కొన్నారు.గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు.

## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా

# ఆవిష్కరించిన మంత్రి సీతక్క

- ప్రజల సంక్షేమమే ప్రజా పాలనకు ప్రధాన లక్ష్యం
- ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఘనంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు




తెలుగు గళం ములుగు, సెప్టెంబర్ 17:

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, ప్రజా పాలన దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పాలన అందించడమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం, ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌బీఎన్‌పై కేంద్రం కఠిన చర్య!



2 లో

న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం): పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్)'ను చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

# బ్రిక్స్ వేళ పాక్, ఐఎస్ఐ ఉగ్ర కుట్ర బట్టబయలు




2 లో

బ్రిక్స్ సదస్సుపై ఉగ్ర కుట్రకు పాక్ ప్లాన్

సరిహద్దు నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు యత్నం

హీరానగర్ సెక్టార్‌ను ఎంచుకున్న ఉగ్ర మూకలు


బోబియా ప్రాంతంలో చొరబాటు స్థావరాల గుర్తింపు

భద్రతా బలగాల అప్రమత్తతతో కుట్ర భగ్నం

ప్రభుత్వ భవనాలు, సైనిక శిబిరాలే లక్ష్యమా?

పెను ఉగ్రదాడి తప్పడంతో ఊపిరిపీల్చుకున్న భారత్

# ట్యాంక్‌బండ్‌పై హైకోర్టు ఆంక్షలు!




2 లో

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి లేదు

హైకోర్టు ఆదేశాలతో అధికారులు కీలక నిర్ణయం

హుస్సేన్‌సాగర్ పరిరక్షణకు కఠిన చర్యలు

ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

నగరవ్యాప్తంగా ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు

బేబీ పాండ్స్.. కృత్రిమ కొలనులు సిద్ధం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

# విమోచన వీరులను మరువొద్దు!

విమోచన దినోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి

ప్రజా ఉద్యమంగా విమోచన పోరాటం

రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్ త్యాగాలు

పటేల్ పాత్రను గుర్తుచేసిన రాధాకృష్ణన్

కేంద్ర బలగాల సేవలకు ప్రశంసలు

సమాన హక్కులతోనే జాతీయ ఐక్యత




2 లో

న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం): హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ఇక్కడ ఉండటం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ అన్నారు. హైదరాబాద్ సంస్థానం విమోచన, భారతదేశంలో విలీనం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్ విమోచన పోరాటంలోని మరుగునపడిన వీరుల కథలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ పోరాటం కేవలం ప్రభుత్వాలు లేదా ప్రముఖ నాయకులకు సంబంధించినది కాదని.. ఇది ప్రజా ఉద్యమమని అన్నారు. విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ కార్యకర్తలు, రైతులు, సామాన్య ప్రజలు ఇందులో పాల్గొన్నారని గుర్తుచేశారు. అనేక మంది జైలు శిక్షలు, హింస, వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు.

# క్షుద్ర పూజల వివాదం.. కోర్టుకెక్కిన హరీశ్!

క్షుద్ర పూజల ఆరోపణలపై కేసు

మహేష్ గౌడ్, దయాకర్‌లకు నోటీసులు

స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయం

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువునష్టం దావా

రాజకీయ ప్రతిష్ట దెబ్బతీసేలా ఆరోపణలు

ఆరోపణలను ఖండించిన హరీశ్ రావు

2 లో

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ కసరత్తు!

రెండు స్థానాలకు ఓటర్ల జాబితా

నవంబర్ 1 అర్హత తేదీ

పాత ఓటర్లూ కొత్తగా దరఖాస్తు

ఫారమ్-18తో దరఖాస్తు తప్పనిసరి

విద్యార్హత సర్టిఫికెట్లు జతచేయాలి

నవంబర్ 25న డ్రాఫ్ట్ జాబితా

డిసెంబర్ 30న తుది జాబితా




న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం): తెలంగాణలో త్వరలో ఖాళీ కాబోతున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నూతన ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నియోజకవర్గాల స్థానాల గడువు మార్చి 2027తో ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు.

2 లో

# విలీన పోరాటంపై కవిత కీలక వ్యాఖ్యలు!

సెప్టెంబర్ 17 చరిత్రపై రాజకీయ రగడ

కాంగ్రెస్, బీజేపీలపై కవిత తీవ్ర విమర్శలు

విలీన పోరాటాన్ని వక్రీకరిస్తున్నారన్న ఆరోపణ

ఆనాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎక్కడ?

మతాలకు అతీతంగా ప్రజల పోరాటం

పోరాట యోధుల త్యాగాలను కవిత స్మరణ

ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్న కవిత

2 లో

# అక్టోబర్ 1 నుంచి కొత్త చట్టం!

నమ్మ క్లినిక్‌లో అవకతవకలపై ఆరోపణలు

విధులకు రాకుండానే రెండేళ్లుగా జీతం

ఆర్టీఐ రికార్డులతో వెలుగులోకి వ్యవహారం

ఎమ్మెల్యే మేనకోడలిపై తీవ్ర ఆరోపణలు

ప్రజాధనం దుర్వినియోగంపై ప్రతిపక్షాల ఫైర్

సమగ్ర విచారణకు ప్రతిపక్షాల డిమాండ్

2 లో

## క్షుద్ర పూజల వివాదం.. కోర్టుకెక్కిన హరీశ్!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** చేతబడులు, క్షుద్ర పూజల పేరుతో తనపై తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు న్యాయపోరాటానికి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి లీగల్ నోటీసులు జారీ చేసిన హరీశ్ రావు, వారు బహిరంగ క్షమాపణ చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల నాంపల్లి కోర్టులో కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. తన రాజకీయ ప్రతిష్టను, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేశారని ఇప్పటికే హరీష్ రావు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసు నేపథ్యం..

తెలంగాణలో వర్షాలు పడకుండా అడ్డుకునేందుకు హరీశ్ రావు వేర్వేరు ప్రాంతాలు, ఆలయ సందర్శనలు చేసి క్షుద్ర పూజలు నిర్వహించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హరీశ్ రావు.. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ లేని విధంగా తన భక్తిభావాన్ని కూడా రాజకీయం చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గతంలో లీగల్ నోటీసులు పంపినప్పటికీ స్పందన రాకపోవడంతో, తాజాగా కోర్టు మెట్లెక్కినట్లు తెలుస్తోంది.

## 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ!

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.ఇక జెండా ఆవిష్కరణ తర్వాత.. రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వ పాలనను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాతిపదిక అని సీఎం పేర్కొన్నారు. అభివృద్ధి కేవలం గణాంకాల్లో కనిపించడం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పుగా ప్రతిబింబించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, పంటల కొనుగోళ్లు వంటి చర్యలను కూడా ప్రభుత్వం కొనసాగిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు.

సామాజిక న్యాయం దిశగా సమగ్ర కుల సర్వే చేపట్టామని, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతోపాటు కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. ఉద్యోగాల భర్తీలోనూ ప్రభుత్వం ముందడుగు వేసిందని సీఎం రేవంత్ తెలిపారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టామని, ఖాళీ పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామని ప్రకటించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైజింగ్ విజన్ 2047తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో దేశంలోనే తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రతిపాదించామన్నారు. సాంకేతికత, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చరిత్రను మరవకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ తెలంగాణను మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## అక్టోబర్ 1 నుంచి కొత్త చట్టం!




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా జనన, మరణాల ఆలస్య నమోదుపై నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026' అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఈ మేరకు భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడటంతో ఈ సవరణ బిల్లు చట్ట రూపం దాల్చింది. ఈ నూతన చట్టం ప్రకారం పుట్టుకలు, మరణాల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం, అవకతవకలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను నిర్దేశించింది.

సెక్షన్ 1 లోని ఉప-సెక్షన్ (2) ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2026 అక్టోబర్ 1ని ఈ చట్ట నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా ఖరారు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నూతన సవరణ చట్టం ద్వారా డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు పాఠశాల ప్రవేశాలు, పాస్‌పోర్ట్, ఆధార్, ఓటర్ కార్డు, వివాహ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జనన ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకమైన ప్రాథమిక పత్రంగా మారనుంది. ఆలస్యంగా చేసుకునే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను క్రమబద్ధీకరించడం, నకిలీ సర్టిఫికెట్లను అరికట్టడం, పారదర్శకమైన కేంద్రీకృత డాటాబేస్‌ను నిర్వహించడమే లక్ష్యంగా ఈ చట్ట నిబంధనలను అమలు చేయనున్నారు.

## ట్యాంక్‌బండ్‌పై హైకోర్టు ఆంక్షలు!




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ నగర పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కఠిన ఆదేశాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అనుమతి లేదని హైదరాబాద్ సిటీ పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

హైకోర్టు ఆదేశాల మేరకు..

హుస్సేన్‌సాగర్‌ను కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి విగ్రహాల నిమజ్జనానికి తావులేదని అధికారులు తేల్చిచెప్పారు. ఉత్సవ కమిటీలు, పూజా సంఘాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

ఈ ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలను నిషేధించినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక బేబీ పాండ్స్, క్రేన్లు, కృత్రిమ నిమజ్జన కొలనులను ఏర్పాటు చేశారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ సూచనల మేరకు పండగను జరుపుకోవాలని కోరారు.

## కేసీఆర్ భూములపై రగడ!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆస్తులపై మరోసారి తీవ్ర రాజకీయ విమర్శలు తెరపైకి వచ్చాయి. అసెంబ్లీ వేదికగా.. కేసీఆర్ ఫాంహౌస్, ఆయన కుటుంబానికి ఉన్న భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ భూములు ఉంటే నిగ్గు తేల్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే అటు బీఆర్ఎస్.. ఇటు కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రభుత్వ భూముల విషయంలో తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ.. బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డిలు.. తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా చేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఆ ట్వీట్‌లో కేసీఆర్ గతంలో ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించిన భూములు, ఆస్తుల వివరాలను బయటపెట్టారు.

కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలో పేర్కొన్న ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన కేసీఆర్.. తనకు భూమి లేదని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని చెప్పారు. ఆ తర్వాతి కాలంలో ఆయన కుటుంబానికి భారీగా భూములు, ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో ఎన్నికల అఫిడవిట్‌లే కీలక ఆధారాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబ ఆస్తులు భారీగా పెరిగాయని మంత్రి పొంగులేటి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తన పేరుపై వ్యవసాయ భూమి, ఇతర భూములు లేవని పేర్కొన్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం ఎన్నికల అఫిడవిట్‌లలో కనిపించే ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. ఈ మార్పులకు కారణం ఏంటని నిలదీశారు.

ఎన్నికల అఫిడవిట్‌లలో అభ్యర్థులు స్వయంగా ప్రకటించే ఆస్తుల వివరాలు నమోదవుతాయి. వాటిలో భూములు, ఇళ్లు, వాణిజ్య ఆస్తులు, ఇతర స్థిరాస్తులు, అప్పులు వంటి అంశాలను తప్పకుండా పేర్కొనాల్సి ఉంటుంది. కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరుగుదలపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి పొంగులేటి.. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూముల విషయంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఆ భూముల కారణంగానే కేసీఆర్ కుటుంబానికి భారీ స్థాయిలో ఆస్తులు సమకూరాయని విమర్శలు గుప్పించారు.

మా తాతకు వందల ఎకరాలుండేవి.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్

మరోవైపు.. కేసీఆర్ భూముల విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా మంత్రి పొంగులేటి మండిపడ్డారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెబుతున్న కేటీఆర్‌పైనా పొంగులేటి విమర్శలు చేశారు. అలాంటి వాదనలకు, ఎన్నికల అఫిడవిట్‌లలో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉంటే దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో అఫిడవిట్‌లో తప్పులు నమోదయ్యాయా.. లేక ప్రజలకు వేరే వివరాలు చెబుతున్నారా.. అని కేటీఆర్‌ను ఉద్దేశించి పొంగులేటి ప్రశ్నించారు.

తెలంగాణలో గత కొంతకాలంగా భూములు, 22ఏ నిషేధిత జాబితా, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల అంశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వివాదానికి కేంద్రంగా మారుతున్నాయి. ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితాలో భూముల సమస్య పెరిగిందని ఆరోపించారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు కూడా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలోని ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## విలీన పోరాటంపై కవిత కీలక వ్యాఖ్యలు!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు మరియు త్యాగాల చరిత్రకు నిదర్శనం అన్నారు. అయితే ఈ చారిత్రక రోజుపై కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీలపై ఘాటు విమర్శలు:

సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. స్టేట్ కాంగ్రెస్ పోరాటం వల్లే తెలంగాణ విలీనమైందని సీఎం అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. నిజానికి సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని నాడు గాంధీజీ అన్నారని కవిత గుర్తుచేశారు. నిజాం సర్కార్ పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని, భారత యూనియన్‌లో కలిశాక తిరిగి జమీందార్లకు అప్పగించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఇక ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమని బీజేపీ మత రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు. ఆనాటి పోరాటంలో అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనే లేవని స్పష్టం చేశారు.

ప్రజలే తుపాకీ పట్టి పోరాడారు:

ఆనాటి జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాడారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి మహనీయులు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి కవులు, రచయితలు సమరశంఖం పూరించారని కొనియాడారు. వారి చైతన్యంతోనే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి వీరులు ఉద్భవించారని పేర్కొన్నారు. నాడు మహనీయులు చూపిన పోరాట స్ఫూర్తితోనే, ప్రస్తుతం కులమతాలకు అతీతంగా ప్రజల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన ముందుకు వచ్చిందని, అరాచక పాలనకు అంతం పలికే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత అన్నారు.

## ఎస్‌బీఎన్‌పై కేంద్రం కఠిన చర్య!

మొదటి పేజీ తరువాయి

ఉపాలోని సెక్షన్ 35(1)(ఏ) ప్రకారం మొదటి షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా, దేశంలో నిషేధించిన 46వ ఉగ్రవాద సంస్థగా ఎస్‌బీఎన్ నమోదైంది. ఈ సిండికేట్ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడమే కాకుండా, అమాయకులైన యువతను, స్థానిక నేరస్థులను ప్రలోభపెట్టి ఉగ్రవాదం వైపు మళ్లిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని 'ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ ' విధానంలో భాగంగానే ఈ కఠిన చర్య తీసుకున్నట్లు హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెట్‌వర్క్ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్వేషపూరిత, రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచారం చేస్తోందని ప్రభుత్వం ఆరోపించింది. ఇతర నిషేధిత ఉగ్ర సంస్థలతో కుమ్మక్కై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు సమీకరించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడంలో ఎస్‌బీఎన్ భాగస్వామ్యం కలిగి ఉందని తెలిపింది. ఈ నెట్‌వర్క్ సభ్యులపై ఉపా, భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం, ఐటీ చట్టం, పేలుడు పదార్థాల చట్టాల కింద ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

## బ్రిక్స్ వేళ పాక్, ఐఎస్ఐ.. ఉగ్ర కుట్ర బట్టబయలు

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** ఇండియా ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సును పాకిస్తాన్, ఆ దేశ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఐఎస్ఐ భగ్నం చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయం తాజాగా బయటపడింది. ఈ అంశంపై ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 11-13 వరకు ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. ఈ సదస్సు ఇండియా నిర్వహించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది.

అయితే, ఇలాంటి సదస్సుకు ఆటంకం కలిగించాలని పాక్, ఐఎస్ఐ ప్రయత్నించాయి. జమ్మూ కాశ్మీర్ కథ్వా జిల్లాలోని హీరానగర్ సెక్టార్ నుంచి ఉగ్రవాదులను సరిహద్దుగుండా ఇండియా పంపించాలని ప్రయత్నించింది. సదస్సు సందర్భంగా దేశంలో పెద్ద ఉగ్రదాడి జరపాలని ప్రయత్నించింది. ఇందుకోసం హీరానగర్‌లోని బోబియా ప్రాంతంలో సరిహద్దు నుంచి ఇండియాలోకి చొరబడేందుకు కొన్ని స్థావరాల్ని కూడా పాక్ ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వ భద్రతా దళాలు ముందుగానే పసిగట్టాయి. ఆయా ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. పాకిస్తాన్‌లోని అమ్రు చాక్, సుక్మాల్ ప్రాంతాలు.. ఇండియాలోని హీరానగర్ ప్రాంతాన్ని సరిహద్దుగా పంచుకుంటాయి.

ఇది మన సరిహద్దుకు అతి దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడినుంచి ఇండియాలోకి సులభంగా చొరబడవచ్చని పాక్, ఐఎస్ఐ భావించాయి. ఈ ప్రాంతంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోనే జమ్మూ-పఠాన్‌కోట్ హైవే ఉంది. ఇక్కడినుంచి ఇండియాలోని ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులు, సాధారణ ప్రజల్ని లక్ష్యంగా చేసుకోవాలని భావించారు. అయితే, భద్రతా బలగాల అప్రమత్తతతో పెను ఉగ్రదాడి తప్పింది.

## విమోచన వీరులను మరువొద్దు!

మొదటి పేజీ తరువాయి



రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ తదితర వీరుల త్యాగాలను జాతీయ స్మృతిలో గుర్తుంచుకోవాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. చరిత్రను కేవలం ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రముఖ నాయకులు మాత్రమే నిర్మించరని.. సామాన్య ప్రజల త్యాగాలు కూడా చరిత్రను నిర్మిస్తాయని అన్నారు.

స్వతంత్ర భారతదేశ ఏకీకరణలో భారతరత్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని రాధాకృష్ణన్ అన్నారు. బలమైన, ఏకీకృత భారతదేశానికి పటేల్ దృఢమైన పునాది వేశారని పేర్కొన్నారు. అసాధ్యంగా కనిపించిన హైదరాబాద్ ఏకీకరణను ఆయన సుసాధ్యం చేశారని కొనియాడారు. హైదరాబాద్ ప్రజలు రజాకార్లకు వ్యతిరేకంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి అపారమని అన్నారు. హైదరాబాద్ విమోచన పోరాటంలో పాల్గొన్న యోధులకు, సర్దార్ పటేల్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర ప్రాంతాల్లో నక్సలిజాన్ని ఎదుర్కొనడంలో కేంద్ర బలగాలు కీలకంగా పనిచేశాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసులతో సమన్వయంతో కేంద్ర సాయుధ బలగాలు వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేశాయని తెలిపారు. నక్సల్ రహిత, సురక్షిత, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంతో కేంద్ర బలగాలు పనిచేస్తున్నాయని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతకు కేంద్ర బలగాలు నిరంతరం కాపలాదారులుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం తగ్గిన తర్వాత ఆరోగ్యం, విద్య రంగాల్లో మార్పులు కనిపిస్తున్నాయని.. ముప్పు తగ్గడంతో గతంలో అస్థిరతకు గురైన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధి, అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు.

రాజకీయ విలీనం భూభాగాలను ఏకం చేస్తే.. రాజ్యాంగ ప్రజాస్వామ్యం ప్రజలను ఏకం చేస్తుందని రాధాకృష్ణన్ అన్నారు. జాతీయ ఐక్యత కేవలం భౌగోళిక సరిహద్దులపై ఆధారపడి ఉండదని తెలిపారు. ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే జాతీయ ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. భిన్న భాషలు మాట్లాడినా, భిన్న సంప్రదాయాలు పాటించినా, భిన్నంగా పూజలు చేసినా భారతీయులంతా రాజ్యాంగం, సార్వభౌమత్వ భావనతో ఒక్కటిగా ఉంటారని అన్నారు. మన సార్వభౌమత్వానికి అసలు అధికారం ప్రజలదేనని స్పష్టం చేశారు.

2022 నుంచి హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "భారత్ ఒక్కటే.. భారత్ ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటుంది. ఇదే సర్దార్ పటేల్‌కు మనం అందించే నిజమైన నివాళి" అని ఉపరాష్ట్రపతి అన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ కసరత్తు!

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణలో త్వరలో ఖాళీ కాబోతున్న వరంగల్- ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నూతన ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నియోజకవర్గాల స్థానాల గడువు మార్చి 2027తో ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. 1 నవంబర్ 2026ను అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సురభి వాణి దేవీ, వరంగల్- ఖమ్మం-నల్గొండ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న పదవీ కాలం వచ్చే మార్చితో ముగియనుంది.

పాత ఓటర్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే:

గత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా ఈసారి కొత్తగా నమూనా ఫారమ్-18 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అని ఈసీ స్పష్టం చేసింది. పాత ఓటరు జాబితా ఆధారంగా నేరుగా పేరు నమోదు చేయబడదని స్పష్టం చేసింది. దరఖాస్తుతో పాటు అవసరమైన విద్యా అర్హత సర్టిఫికెట్ల ధ్రువీకరించిన కాపీలను జతచేయాల్సి ఉంటుంది. అర్హులైన పట్టభద్రులు సీఈఓ అధికారిక వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా నిర్ణీత ఫారమ్‌ను పూర్తి చేసి అవసరమైన పత్రాలతో ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ/ డెసిగ్నేటెడ్ అధికారులకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా కానీ అందజేయవచ్చని సీఈఓ కార్యాలయం తెలిపింది.

**ఓటరు జాబితా షెడ్యూల్:**

పబ్లిక్ నోటీసు విడుదల: 28 సెప్టెంబర్2026

ఫారమ్-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 6 నవంబర్ 2026

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ: 25 నవంబర్ 2026

అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ: 25 నవంబర్ 2026 నుండి 10 డిసెంబర్ 2026 వరకు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 30 డిసెంబర్ 2026

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

## ఐటీడీఏ ఏటూరునాగారంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పి.ఓ లెనిన్ వత్సల్ టోప్పో




తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 17:

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం--2026 సందర్భంగా ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయ ప్రాంగణంలో గురువారం ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత ప్రజల అవసరాలు, సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజా సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఐటీడీఏ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్న దానం మహా దానం దానం కన్నా అన్నదానం గొప్పది

## జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



దానం కన్నా అన్నదానం మహా గొప్పదని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి అన్నారు. గురువారం వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం బిసి కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ నాయకులు యుగంధర్ రెడ్డి పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం వారిని నిర్వాహకులు దుస్స మార్కండేయ, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బోడ సోమన్న, ఉప సర్పంచ్ ఎస్.కె షరీఫ్, కాలనీవాసులు రాయల రవి, అలవాల యాదగిరి, అలవాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై దాడిని తీవ్రంగా ఖండించిన

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ధర్మసాగర్, సెప్టెంబర్ 17 (తెలుగు గళం):

వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురవత్ లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడిని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులపై దాడులు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురవత్ లక్ష్మణ్ నాయక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంపై ఎమ్మెల్యే శ్రీహరి స్పందించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులపై దాడులకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం ఆమోదయోగ్యం కాదని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి : లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించరాదని పేర్కొన్నారు.

క్షతగాత్రుడి ఆరోగ్యంపై ఆరా : దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరా తీశారు. ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి లక్ష్మణ్ నాయక్‌కు అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# తండలకు పంచాయతీ హోదా... ఎస్టీలకు 6 నుంచి 10 శాతం రిజర్వేషన్

## గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్
## తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు
## మాజీ మంత్రి,డోర్నకల్ మాజీ శాసనసభ్యులు,డిఎస్ రెడ్యానాయక్




తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన చారిత్రక నిర్ణయానికి కృతజ్ఞతగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఐదో వార్డు కౌన్సిలర్ బోడ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి,డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డి ఎస్ రెడ్యానాయక్ హాజరై పాలాభిషేకం కార్యక్రమం,భారీ ఎత్తున కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు,

ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు, అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు,ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ..గిరిజనుల ఆరాధ్య దైవం మాజీ సీఎం కేసీఆర్,గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం, గిరిజన బంధు, పోడు భూములకు హక్కులు కల్పించడం వంటి నిర్ణయాలు చారిత్రాత్మక ఘట్టాలు అన్నారు,రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది గిరిజనులు ఉన్నారు, గిరిజనుల జీవితాల్లో సెప్టెంబర్ 17 ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అన్నారు,రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడంతో గిరిజన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో మరింత ప్రయోజనం జరుగుతుంది అన్నారు,విద్య ద్వారానే వికాసం సాధ్యమని నమ్మిన కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందించారు, గిరిజన బిడ్డల భవిష్యత్తుకు బలమైన పునాది వేశారు అన్నారు,

దశాబ్దాలుగా పాలించిన ప్రభుత్వాల పాలన ఒక ఎత్తయితే, కేసీఆర్ పాలన మరో ఎత్తు అన్నారు,గత పాలనల్లో గిరిజన ప్రాంతాల్లో కనీస వసతులు కూడా సరిగా కల్పించిన దాఖలాలు లేవు అన్నారు,కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో 3,416 తండాలు గ్రామపంచాయతీలుగా మారాయి. గిరిజన బిడ్డలే స్థానిక పాలకులుగా ఎన్నికై తమ తండాల అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారు అన్నారు,కాంగ్రెస్ తెలంగాణ అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు వివరించాలి అన్నారు,కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అసహనం ఉంది అన్నారు,కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని రాజకీయ కుట్రలు చేసినా బీఆర్ఎస్‌ను ప్రజల నుంచి దూరం చేయలేరు, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంట్ల మహిపాల్ రెడ్డి,వస్రం, చరణ్, బోడ రెడ్డి, గిరిజన మహిళలు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



తెలుగు గళం న్యూస్ పాలకుర్తి సెప్టెంబర్ 17

తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామ ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను గుర్తు చేసుకున్నారు.

# మరిపెడ లో ఘనంగా విశ్వకర్మ జయంతి



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని గురువారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో విశ్వకర్మలు జయంతి వేడుకలు నిర్వహించారు. అనుముల సుధాకర్ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అర్చకులు పెద్దోజు నరేష్ ఆచార్యులు వేదమంత్రోత్సవ నెల మధ్య వేడుకలు నిర్వహించారు. తొలుత విశ్వకర్మ చిత్రం పటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జండా ఆవిష్కరణ చేసి ఘటన కేంద్రంలో జై విశ్వకర్మ జై జై విశ్వకర్మ నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం సామూహిక విశ్వకర్మ స్తుతి పారాయణం చేశారు. కార్యక్రమంలో దాస రోజు రమేష్, అనుముల పుల్లయ్య చారి తాటికొండ అనంత చారి, కురవి మధు, తాడూరి రమేష్, మోత్కూరి రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# బీమవరంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి"



సత్తుపల్లి/వేంసూరు, సెప్టెంబర్ 17 (తెలుగుగళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని బీమవరం గ్రామ శివారులో ఖాళీ ప్రదేశంలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వేంసూరు పోలీసులు గురువారం దాడి చేశారు.ఎస్సై పల్లెల ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో వేంసూరుకు చెందిన వేల్పుల నవకుమార్, బీమవరానికి చెందిన కవిశెట్టి సత్యనారాయణ, గుదె వెంకటేశ్వరరావు, సత్తుపల్లి ఎన్టీఆర్ కాలనీకి చెందిన కేదారి నాగయ్య పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.29,600 నగదు, ఒక మోటార్‌సైకిల్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బీమవరానికి చెందిన తోట మురళీకృష్ణ, తుంబూరుకు చెందిన సురేష్, సత్తుపల్లి ఎన్టీఆర్ కాలనీకి చెందిన జగన్నాదం రవి, దాసరి నాగరాజు, వేంసూరుకు చెందిన తోట శ్రీనివాసరావు తదితరులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


# తండాల ఆరాధ్యదైవం కేసీఆర్ : బీఆర్ఎస్ నాయకులు"



సత్తుపల్లి/వేంసూరు, సెప్టెంబర్ 17(తెలుగు గళం) న్యూస్: గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల చౌడవరం తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు వేంసూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడంతో పాటు తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో: మండల పార్టీ అధ్యక్ష,

కార్యదర్శులు పాలా వెంకటరెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, యర్రా రమేష్, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి,మారాజు సురేష్,గాయం రాంబాబు,గొర్ల సత్యనారాయణరెడ్డి,చిన్ని కృష్ణ,రావూరి నాయుడు,మూడు రామదాసు,బొంతు రామారావు,మందపాటి రామిరెడ్డి,గూగులోతు రాము,మూడు గోపి,వెంకటేష్,శివ,రమేష్,తులసి,రజిని,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష ఉండ్రాళ్లతో గణనాథునికి మహా నివేదన



తెలుగు గళం న్యూస్ పాలకుర్తి సెప్టెంబర్ 17

మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా--హన్మకొండ రోడ్డులో గజానన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.. ఉత్సవాల్లో భాగంగా గురువారం లక్ష ఉండ్రాళ్లతో గణనాథునికి మహా నివేదన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఉండ్రాళ్లను గణనాథునికి సమర్పించారు. గణపతి నామస్మరణలు, భక్తిగీతాలతో ఉత్సవ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.మహిళలు ఉత్సాహంగా పాల్గొని మహా నివేదన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన బాల్య మిత్రులు

తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్ సెప్టెంబర్ 17



జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి జీ గ్రామానికి చెందిన రంగు శివ గౌడ్ ఇటీవల హఠాత్తుగా మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది.ఈ నేపథ్యంలో శివ గౌడ్‌తో కలిసి పదో తరగతి చదివిన 2014--15 బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి మిత్రులు తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మిత్రుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఇన్‌స్పెక్టర్ అనుముల శ్రీనివాస్



ధర్మసాగర్, సెప్టెంబర్ 17 (తెలుగు గళం):

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుముల శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా

## మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీ నాయకులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 17:



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగపేట మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రావుల జానకిరావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మల్లూరు గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. మోదీ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ దేశ అభివృద్ధి, పురోగతికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోదేం రవీందర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడు కున్నం వెంకట్ రెడ్డి, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి యర్రం వీరన్ కుమార్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కటుకోజు ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శులు బడే జగన్మోహన్, నిడదవోలు శ్రీనివాస్, మండల కార్యదర్శి మినుగు తిరుపతితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

## ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం: సీఐటీయూ

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 17



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు పిలుపునిచ్చారు.తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు రాపర్తి అశోక్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిందన్నారు.పోరాట కాలంలో సుమారు మూడు వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసి, గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసిన చారిత్రక వారసత్వం కమ్యూనిస్టులదని పేర్కొన్నారు.నేడు భూమిలేని పేదలకు భూమి, ఇల్లు లేని పేదలకు ఇళ్లు, ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఆ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంతో సంబంధం లేని శక్తులు చరిత్రను వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని కాపాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముత్తయ్య, రమణ, రమేష్, జగదీష్, సోమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మంగపేటకు విద్యా రంగంలో అరుదైన గౌరవం

**జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురి ఎంపిక**

**ఉపాధ్యాయుల సేవలకు జిల్లా స్థాయిలో గుర్తింపు**



**తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 17:**

ములుగు జిల్లా మంగపేట మండలానికి విద్యా రంగంలో అరుదైన గౌరవం దక్కింది. మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో కొమరం నాగేశ్వరరావు, ఎస్జీటీ, ఎంపీపీఎస్ అబ్బాయిగూడెం; చిన్న ప్రవీణ్ కుమార్, ఎస్జీటీ, ఎంపీపీఎస్ పాత నరసాపురం; జర్పుల వెంకటేశ్వర్లు, స్కూల్ అసిస్టెంట్ (గణితం), జడ్పీహెచ్ఎస్ మంగపేట ఉన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడం, విద్యపై ఆసక్తి కల్పించడం, పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి అంకితభావంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో అవార్డులు దక్కడం మంగపేట మండలానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారిణి పి.మేనక ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులను అభినందించారు. వారి కృషి, అంకితభావం, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతమైన సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మరింత మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో మంగపేట మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పోషకాహారంతోనే చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్

**గుర్తూరు తండాలో ఘనంగా పోషణ మాసం అవగాహన కార్యక్రమం**

**జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.. పోషకాహారాన్ని అలవాటు చేసుకోవాలి: సీడీపీఓ శిరీష**




**తెలుగు గళం గుర్తూరు తండా, ములుగు సెప్టెంబర్ 17:**

పోషణ మాసం సందర్భంగా కొడిసెలకుంట సెక్టార్ పరిధిలోని గుర్తూరు తండా గ్రామపంచాయతీలో పోషణ మాసం అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ బానోత్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ బానోత్ రాజు మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా, శారీరకంగా మరియు మానసికంగా ఎదగాలంటే ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. స్థానికంగా సులభంగా లభించే ఆకుకూరలు, పప్పులు, అన్ని రకాల కూరగాయలు, పాలు, పండ్లు వంటి ఆహార పదార్థాలను పిల్లల ఆహారంలో భాగం చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ శిరీష మాట్లాడుతూ పోషకాహారం ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించాలన్నారు. చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా అనారోగ్య సమస్యలను తగ్గించడంతో పాటు వారి ఎదుగుదలకు తోడ్పడవచ్చని తెలిపారు. పిల్లలకు జంక్‌ఫుడ్ అలవాటు చేయకుండా ఇంట్లోనే పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గున్నాల యాకుబ్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్. సరస్వతి, కమరున్నిసాబేగం, ఏఎన్ఎం రమ, అంగన్వాడీ టీచర్లు ఎల్. జ్యోతి, పి. ప్రమీల, స్వరూప, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాన్ని సందర్శించిన ఏసిపి"







**సత్తుపల్లి/పెనుబల్లి,సెప్టెంబర్17(తెలుగు గళం) న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం వీఎం బంజర గ్రామంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గణేష్ మండపాన్ని గురువారం కల్లూరు పోలీస్ ఏసిపి వసుంధరాయాదవ్ పరిశీలించారు. వినాయకుని దర్శించుకున్నారు.ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రసాదాన్ని అందించారు.ఈ సందర్భంగా మండప నిర్వాహకులతో మాట్లాడి గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం తేదీ, చేపట్టిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణకు రూపొందించిన ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు.అందించారు. ఆమెతో పాటు సీఐ ముత్తి లింగయ్య, ఎస్సై షకీర్ లు వున్నారు.

## కల్లూరులో ఘనంగా 'కోటి భగవద్గీత మహాయజ్ఞం'

**ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు భగవద్గీత ప్రతుల పంపిణీ..**



**సత్తుపల్లి/కల్లూరు,సెప్టెంబర్ 17 (తెలుగుగళం) న్యూస్:**

జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కోటి భగవద్గీత మహాయజ్ఞం' కార్యక్రమంలో భాగంగా కల్లూరు పట్టణంలో భగవద్గీత ప్రతుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, విస్తృతంగా జరిగింది.

**కార్యక్రమానికి శ్రీకారం:**

కల్లూరు పట్టణంలోని ప్రసిద్ధ స్వయంభు బ్రహ్మ సూత్రం ఉన్న శివాలయంలో కొలువైయున్న మహాగణపతికి తొలి పూజ సమర్పించి ఆయన ఆశీర్వాదం తీసుకొని, అనంతరం మహాదేవునికి తొలి భగవద్గీత సమర్పించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

**మున్సిపాలిటీ కార్యాలయంలో పంపిణీ:**

కల్లూరు మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఆళ్లకుంట నరసింహారావు మరియు స్థానిక కౌన్సిలర్ల సమక్షంలో భగవద్గీత ప్రతులను అందజేశారు.

**ముఖ్య నాయకులకు అందజేత:**

బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ లక్కనేని రఘుని కలసి భగవద్గీత ప్రతిని బహుకరించారు.

**ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ మరియు పార్టీ నాయకుల సమక్షంలో భగవద్గీత పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్ మాట్లాడుతూ "ప్రతి హిందువుకు భగవద్గీత అందించడమే మా ముఖ్య లక్ష్యం. సనాతన ధర్మాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాబోయే రోజుల్లో జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారాన్ని మరింత పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రత్యేక వాహనాలను సిద్ధం చేస్తున్నాం. సనాతన ధర్మ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తాం" అని అన్నారు.

**నరేష్‌కి ఘన సత్కారం:**

కోటి భగవద్గీత మహాయజ్ఞం లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని బిజెపి కల్లూరు మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, వివిధ హిందూ సంఘాల నాయకులు మరియు బిజెపి ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా జై హనుమాన్ సేవా ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

### సౌత్ ఆఫ్రికాలో సత్తా చాటిన

## ఆదివాసీ బిడ్డ మొడెం వంశీ

**ఇంటర్నేషనల్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్‌లో రెండో స్థానం**

**వంశీని ఘనంగా సన్మానించిన గుమ్మడిదొడ్డి సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు**



**తెలుగు గళం వాజేడు, సెప్టెంబర్ 17:**

ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు మొడెం వంశీ అంతర్జాతీయ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో సౌత్ ఆఫ్రికాలో రెండో స్థానంలో నిలిచి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా వంశీని గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ సర్పంచ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా సాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ప్రతిభ చాటిన వంశీ యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నూతన ఇన్‌స్పెక్టర్‌ను ఘనంగా సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు....



**ధర్మసాగర్ (తెలుగు గళం )సెప్టెంబర్ 17:**

ధర్మసాగర్ మండల పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనుముల శ్రీనివాస్‌ను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో నూతన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డు దయాకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు మాట్లాడుతూ,అనుముల శ్రీనివాస్ గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేశారని తెలిపారు.ఆ సమయంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు లా అండ్ ఆర్డర్ విషయంలో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు.ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన గతంలో కంటే మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలని, ప్రజల మన్ననలు, ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో బొడ్డు శాంతి శాంతిసాగర్ మాదిగ, సింగారపు పవన్ మాదిగ, పొడిశెట్టి ప్రతాప్ మాదిగ, నక్క సుమన్ మాదిగ, పొడిశెట్టి సురేంద్ర మాదిగ, రామంచ ఏసు మాదిగ, మేక సృజన్ మాదిగ, సోంపల్లి అన్వేష్ మాదిగ, ఎండీ శంషొద్దీన్, మట్టెడ బాలు, గొల్లపల్లి అనిల్ మాదిగ, పుట్ట ప్రశాంత్ మాదిగ, పుట్ట దేవరాజు,పొడిశెట్టి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ ఆర్థిక చేయూత



**తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 17:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం మద్దులగూడెం గ్రామానికి చెందిన నేలపట్ల మధు భార్య పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు బాడిశ నాగ రమేష్ మానవతా దృక్పథంతో రూ.3,000 ఆర్థిక సాయం అందించారు. మంగపేట మండలం రాజుపేట లక్ష్మీనర్సాపూర్‌కు చెందిన బాడిశ నాగ రమేష్ తరపున అందించిన ఆర్థిక సహాయాన్ని మల్లూరు గ్రామ బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోయం ఈశ్వర్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ నిరుపేద కుటుంబాలకు తన వంతు సహకారం అందిస్తామని బాడిశ నాగ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో పగిడిపాల దామోదర్, ముక్కెర శ్రీనివాస్, ముక్కెర సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### బాలాజీ బంజారా కాలనీలో

## గణపతికి ప్రత్యేక పూజలు

**హాజరైన లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పల్లవి రాజు నాయక్ దంపతులు**



**తెలుగు గళం న్యూస్ హనుమకొండ**

హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలోని బాలాజీ బంజారా కాలనీలో జరుగుతున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ వేడుకలకు లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వేదపండితులు రామ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన విశేష పూజల్లో పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..కాలనీలో కొలువుదీరిన లంబోదరుడి ఉత్సవాలకు దాతలు,కాలనీ ప్రజలు,భక్తులు అందిస్తున్న సహాయ సహకారాలు వెలకట్టలేనివని కొనియాడారు.విగ్రహ దాత బానోత్ లలిత రామచంద్ర నాయక్,ఏటా శాశ్వత రేకుల షెడ్ సమకూరుస్తున్న భూక్య చంద్రకళ కిషన్ నాయక్ కుటుంబ సభ్యులు రజిత కిరణ్,భవాని కిషోర్ దంపతులు,మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన సింగ్ లాల్,తాజా మాజీ కార్పొరేటర్ లావుడియా అనూష రవి నాయక్ తదితరులు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమన్నారు.ఉత్సవాల విజయవంతానికి సహకరిస్తున్న కాలనీలోని ప్రతి కుటుంబానికి,భక్తులకు కమిటీ తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.

## "నేటి విద్యార్థికి ఏఐతో పోటీపడే విద్యా విధానం కావాలి"

**సాంకేతికతతో పాటు స్వతంత్ర ఆలోచన, అనుభవం, విచక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**"మనిషి అదుపులో ఏఐ ఉంటే ప్రగతి.. ఏఐ అదుపులో మనిషి ఉంటే వినాశనం"**

**విద్యార్థులు ఏఐని సాధనంగా ఉపయోగించుకోవాలి.. ప్రత్యామ్నాయంగా కాదు**

**"సమాధానం చెప్పే విద్య కాదు.. సమాధానాన్ని అన్వేషించే విద్య కావాలి"**





**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు సెప్టెంబర్ 17:**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) విద్యా రంగంలో కీలక మార్పులకు కారణమవుతోందని డాక్టర్ డి. శ్రీనివాస్, హిస్టరీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహాదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మరియు సిహెచ్. వెంకటయ్య, చరిత్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరునాగారం, ములుగు జిల్లా పేర్కొన్నారు. ఏఐ విద్యార్థులకు సమాచారాన్ని వేగంగా అందించడం, క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరించడం, భాషలను అనువదించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రాజెక్టులు--పాఠ్యాంశాల రూపకల్పనలో సహకరించడం వంటి అనేక అవకాశాలను అందిస్తోందన్నారు. అయితే ఏఐపై పూర్తిగా ఆధారపడకుండా విద్యార్థులు ముందుగా సమస్యను స్వయంగా అర్థం చేసుకుని, ఆలోచించి, పరిష్కరించేందుకు ప్రయత్నించిన తర్వాత అవసరమైన సందర్భంలో ఏఐని సహాయక సాధనంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్య అంటే కేవలం సమాచార సేకరణ కాదని, ప్రశ్నించడం, విశ్లేషించడం, తార్కికంగా ఆలోచించడం, సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం, మంచి--చెడులను విచక్షణతో గుర్తించడం, సృజనాత్మకతను పెంపొందించుకోవడం విద్య యొక్క ప్రధాన లక్ష్యాలని వివరించారు. విద్యార్థి ప్రతి ప్రశ్నకు ఏఐ నుంచి సమాధానం పొందే అలవాటుకు బదులుగా సమాధానాన్ని స్వయంగా అన్వేషించే నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. అనుభవాత్మక విద్యకు కూడా భవిష్యత్తు విద్యా విధానంలో ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక పనిని స్వయంగా చేయడం, తప్పులను గుర్తించడం, వాటిని సరిదిద్దుకోవడం, మళ్లీ ప్రయత్నించడం ద్వారా పొందే అనుభవం విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సాంకేతిక సౌకర్యాలు పెరుగుతున్న కొద్దీ శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ, అనుభవం వంటి మానవ విలువలు వెనుకబడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ అందించే సమాచారం ఎల్లప్పుడూ ఖచ్చితమైనదేనని భావించకూడదని, కొన్నిసార్లు తప్పులు, అసంపూర్ణ సమాచారం లేదా సందర్భానికి సరిపోని వివరాలు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు విశ్వసనీయమైన ఇతర ఆధారాలతో సమాచారాన్ని ధృవీకరించుకోవాలని సూచించారు. దీనివల్ల విద్యార్థుల్లో సమాచారాన్ని స్వీకరించే సామర్థ్యంతో పాటు దానిని పరిశీలించే, విశ్లేషించే విమర్శనాత్మక ఆలోచనా శక్తి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఏఐ, డిజిటల్ పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ వినియోగం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, శారీరక శ్రమ తగ్గడం వంటి అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. సాంకేతిక అభివృద్ధి మానవ జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు ప్రకృతి, సమాజం, ఆరోగ్యం పట్ల బాధ్యతను పెంచే విధంగా ఉండాలని సూచించారు."మనిషి అదుపులో ఏఐ ఉంటే ప్రగతి.. ఏఐ అదుపులో మనిషి ఉంటే వినాశనం" అనే భావనను గుర్తుంచుకుని, ఏఐని మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా మానవ మేధస్సును మరింత అభివృద్ధి చేసే సాధనంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే విద్యా విధానంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ విలువలు, అనుభవం, శ్రమ, స్వతంత్ర ఆలోచన, సృజనాత్మకత, విచక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచించారు. విద్యార్థికి సిద్ధమైన సమాధానం అందించడం కంటే, సమాధానాన్ని స్వయంగా వెతికే సామర్థ్యాన్ని కల్పించడమే నిజమైన విద్య లక్ష్యంగా ఉండాలని డాక్టర్ డి. శ్రీనివాస్, సిహెచ్. వెంకటయ్య పేర్కొన్నారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.